# ముందరి కాళ్లకు బంధం

ఆ వేళ పన్నెండో తారీఖు. శంకరం నెల జీతమంతా అంతకుముందే ఖర్చైపోయింది. ఐపోయిందంటే ఆశ్చర్యమేముంది? మహా ఆఫీసర్లని చెప్పుకుంటూ, వందలు తెచ్చుకునేవాళ్లకే ఐపోతున్నప్పుడు, కో-ఆపరేటివ్ బ్యాంకులో నౌకరీచేసే ఈ గుమాస్తా జీతం రోంతా రెండో వారంలోనే ఐపోయిందీ అంటే అబ్బురం లేదు.

వచ్చిపడ్డ చిక్కేమిటంటే ఆవేళ శనివారం. వారంలో ఆఖ్రరోజు. రేషను బియ్యం, గోధుమలూ, చక్కెరా కొనుక్కోవలసిన కడపటి దినం. ఆ మూడుసరుకులకీ మొత్తంబిల్లు ఐదురూపాయిల పైచిల్లరవుతుంది. శంకరం వద్ద ఆ 'పైచిల్లర' ఉందిగాని 'ఐదు' లేదు. "అప్పు ఎవడిస్తాడూ?" అని ప్రొద్దుట్నుంచీ ఆలోచిస్తున్నాడు శంకరం.

'అంత పెద్దఊరు. ఎన్నేళ్ళనుంచో ఉంటున్నా డక్కడ. స్నేహితులూ, పరిచయస్తులూ ఎంతోమంది ఉండుండాలి. బ్యాంకుకు వచ్చివెళ్ళే 'కష్టమర్లం'తా అతనికి తెలిసినవాళ్ళే అయిరి. అలాంటప్పుడు ఒక్క ఐదు రూపాయిల అప్పే పుట్టదూ?' అంటారేమో. పుట్టదనే చెప్పాలి. ఏమంటే, ఇవ్వకలిగిఉండి, ఇష్టపడ్డ మిత్రులంతా అతగాడికి ఇదివరకే ఇచ్చేశారు. ఆ ఐదులూ, పదులూ అతడింకా తీర్చనేలేదు. తీర్చలేకనే పాపం. అలాంటప్పుడు మళ్ళీ వాళ్ళనేవెళ్లి అడగటం సబబూ కాదు, ప్రయోజనమూ ఉండదు.

ఇంక బ్యాంకుకు వచ్చివెళ్లే 'కష్టమర్ల' మాటంటారా?...ఎంతో ఆప్యాయంగా కబుర్లు చెప్పివెళ్ళే చలమాజీగారిని చనువుకొద్దీ ఓమాటు ఒక 'ఫైవరు' అడిగి చూశాడు. ఆయనకు 'ఎక్కౌంటు'లో డబ్బున్న సంగతి శంకరానికి తెలుసుగనక, ఆయన ఇష్టంవుంటే ఇవ్వగలడన్న ధైర్యంతోనే అడిగాడు. ఆ అడగటంకూడా ఆయన బ్యాంకుకు వచ్చినప్పుడు కాదు. దీనికోసం

ప్రత్యేకం ఆయన యింటికివెళ్ళి అడుగుతే మర్యాదగా ఉంటుందనీ, మొదట ఇవ్వటం ఇష్టంలేకపోయినా, ఇంతదూరం ఆశపడివచ్చాడు. 'ఉత్తచేతులతో పంపేస్తే బాగుండదు'అని ఆలోచించైనా చలమాజీ ఇవ్వకపోడనీ ఉద్దేశపడి, శంకరం ఆయన బసకే వెళ్ళేడు. 'అప్పు' అంటూ ఆయన యింటికి ఎందరో రావటం, ఆయన ఏదో సాకుచెప్పి పంపెయ్యటం ఇదివరకు జరుగుతూన్నదే. శంకరాన్నికూడా అలా పంపేసిఉంటే తీరిపోను. కాని అంతటితో ఆగక, చలమాజీగారు ఆ విషయం బ్యాంకు మేనేజరుదాకా తీసుకువెళ్ళి చెప్పారు. చెప్పటంలోనూ ఏమని? "మీ గుమాస్తా శంకరం చాలా అప్పులలో ఉన్నట్లున్నాడు. అలాంటివాళ్ళని బ్యాంకులో ఉంచటం శ్రేయస్కరం కాదేమో" అని. ఆయన వెళ్ళటంతోనే మేనేజరు శంకరాన్ని పిలిచి, 'అప్పులు చేస్తున్నావుట! ఉద్యోగం ఊడిపోతుంది, జాగ్రత్త!" అని హెచ్చరించాడు. ఆ దెబ్బతో శంకరానికి చావుతప్పి కన్నులొట్టపోయినంత పనిజరిగి, 'ఇంత ఎన్నడూ కష్టమగ్గనుమాత్రం అప్పు అడగకూడ'దని ఒట్టుపెట్టుకున్నాడు.

'అప్పు ఎవడిస్తాడు?' అనే ప్రశ్నతో ఆ ఉదయం శంకరానికి ఈ గొడవలన్నీ జ్ఞప్తికొచ్చాయి. ఎనిమిదిగంటలైపోయిందప్పుడే. మరోగంటకి ఆదరాబాదరా రెండు మెతుకులు నోట్లో వేసుకొని బ్యాంకుకు పరుగెత్తాలి. ఆ ప్రొద్దుట ఎక్కడకువెళ్ళి, ఎవణ్ణి అడగటానికైనా ఇంక ఒక్కగంటే వ్యవధి. ఏమీ పాలుపోక అతడు భార్యను సలహా అడిగాడు. అతడు మరిచిపోయాడేమో అన్నట్లామె, శివకామేశ్వరరావు, శేషగిరి, సుబ్బరామయ్య, రామచంద్రుడు, వెంకటప్ప, ఉమామహేశం వగైరా మిత్రుల పేర్లన్నీ ఒక్కొక్కటే చెప్పటం మొదలెట్టింది. వాళ్ళకి అతడు తీర్చవలసిన పాత బాకీలు జ్ఞప్తికి రావటం తప్ప ప్రయోజనం లేకపోయింది. ఆఖరికి జగదాంబ, "చూడండి, ఆవేళ పార్కులో కనపడి మీతో చాలాసేపు ఆప్యాయంగా మాట్లాడారు. ఆయన పేరేమిటి?' అంది. "ఆయనా? గవరాజుగారు. మంచి బాగా జ్ఞాపకం చేశావు! చాలా యోగ్యుడూ. స్నేహపాత్రుడూను. ఈ చిక్కు సమయంలో ఆదుకోకపోడు. ఎక్కడ కనపడ్డా, 'మా యింటికోమాటు రండి' అని చాలామాట్లు అడ్రెస్సుకూడా చెప్పాడు. 'శివలెంకవారి వీధి' అని కదూ అన్నాడు?... నెంబరేమిటి చెప్మా?... ఎంచక్కా, అక్కడికి వెళ్ళి వాకబుచేస్తే సరి" అంటూ శంకరం పైమీద ఖండువా వేసుకుని బయల్దేరాడు.

శివలెంకవారి వీధి ఆరుఫర్లాంగులైనా ఉంటుంది. దారిలో ఆలోచించుకుంటూ నడిచాడు శంకరం. గవర్రాజుగారికీ తనకూ అంతా ఈ మధ్యనే పరిచయం. ఆయనకు తన ఆర్థిక ఇబ్బందులేమీ తెలిసివుండవు. వెళ్ళటంతోనే అప్పు ప్రశక్తి తేవటంకన్న మొదట ఆ కబురూ ఈ కబురూ చెప్పుకున్నాక, 'నే నొకటి అడుగుదామని వచ్చానండి' అని ఆఖరికి తేల్చడం మంచిదని నిశ్చయించుకున్నాడు. చురుగ్గా నడిచాడేమో త్వరగానే చేరుకున్నాడావీధికి తెలియకుండానే గవర్రాజుగారి బస దాటిపోతున్నాడు. అట్టే పైకి పోకుండానే చప్పట్లు వినిపించాయి. "శంకరంగారోయ్. మిమ్మల్నే!" అనే కేకకూడా వినిపించింది. వెనక్కి తిరిగి చూశాడుకదా ఎవరోకాదు పిలుస్త. గవర్రాజుగారే! ఆయనే చూసి పిలవటం, శంకరానికి శుభసూచకంగా కనపడింది. వచ్చినపని సగం అయినట్లే తోచింది.

గవర్రాజుగారు శంకరానికి ఎదురుగావచ్చి లోపలకు తీసుకువెళ్ళి కుర్చీ చూపించారు. కూచోటం తడవుగా ఆయనే ఆరంభించారు ప్రసంగం. ఆంధ్రరాష్ట్రం, శ్రీబాగ్ ప్యాక్టు, రాయలసీమ డెప్యుటేషను వగైరా గొడవలన్నీ ఒకదానివెనక ఒకటి వచ్చి వెళ్ళాయి. మధ్యమధ్య ఆయన శంకరాన్ని, 'ఏమంటారు?' అని అడుగుతూండేవారు కాని, శంకరం ఏమీ అనక పూర్వమే మరోవిషయంలోకి ప్రసంగం మారింది.

గడియారం తొమ్మిదికొట్టి, శంకరానికి తెములుచుకుపోదామన్న తొందర ఎక్కువైంది. అది గ్రహించి, గవర్రాజుగారు, 'ఏదో తొందర పనిమీద వెడుతున్నట్లున్నారు, ఆపేశాను' అన్నాడు. ఆ అదును చూసుకుని శంకరం, 'ఎక్కడికో కాదండి, మీ యింటికే' అని అనబోయాడుకాని ఇంతట్లో గవర్రాజు గారే, 'మాఫండి శంకరంగారూ, మరోలా అనుకోకండి. ఒక్క సాయం చేస్తారని పిలిచాను' అన్నాడు.

తనవల్ల కాతగ్గపని ఏదోఉంది. అనటంతోనే శంకరం సంతోషించాడు. ఆ పనేమిటో చేసిపెట్టటానికి ఒప్పుకుంటే, తర్వాత సొమ్ము చేబదులు అడగటానికి అంతగా మొగమాటపడనక్కర్లేదని తోచింది. 'ఏమిటో చెప్పండి. తప్పకుండా చేస్తాను' అన్నాడు.

"ఏమీలేదు! క్రితం శనివారం రాత్రి నరసింహంగారువచ్చి, 'ప్రాణంమీదికి వచ్చింది. ఒక్క ఏభై రూపాయలుంటే ఇవ్వండి. సోమవారం

బ్యాంకులోంచి తీసి ఇస్తాను' అని నమ్మించి పట్టుకుపోయాడు. సోమవారం కాదుకదా ఇంతవరకూ మనిషి పికర్ లేదు. దుర్మార్గుడు! నమ్మించి ఇబ్బందిలో పెట్టాడు. ఈవేళ రేషనుకు ఆఖర్రోజుకదా. మరోఖర్చు కూడా వచ్చింది. ఒక్క పాతికరూపాయలు సర్దాలి మీరు. రెండు మూడురోజుల్లో నాకో బాపతు సొమ్ము రావలసిఉంది. ఇచ్చేస్తాను" అన్నాడు.

నిలువునా నీరైపోయాడు శంకరం! రెండుమూడు నిముషాలదాకా మాటే పెగిలిందికాదతనికి. ఆఖరికి ఓ గొప్పనేరం చేసినవాడికిమల్లే నిలబడి, 'క్షమించాలి. నావద్ద ఏమీలేదు. మిమ్మల్నే అడుగుదామని వచ్చాను' అన్నాడు. మరోనిముషం మళ్ళీ నిశ్శబ్దం. ముడిపడ్డ కనుబొమ్మల్తో గవర్రాజుగారు, 'పోనీలెండి. పనిమీద వెడుతున్నట్లున్నారు. వెళ్ళండి' అన్నాడు.

శంకరం, 'లేదండి, ఇక్కడికే వచ్చాను' అన్నాడుకాని, ఆయన వినిపించుకోకుండా లోపలికి వెళ్ళిపోయారు. ఇహ అక్కడ నిలబడి ప్రయోజనం లేదని శంకరం ఇంటిదారిని పట్టాడు.

గవర్రాజు లోపలకు వెళ్ళేటప్పటికి ఆయనభార్య ఎదురైంది. "చూశావా, దొంగముండాకొడుకు, ఎంత అబద్ధమాడేశాడో! 'మీదగ్గరికి అప్పకోసం వచ్చానం'టూ ముందరికాళ్ళకు బంధంవేసేశాడు!" అన్నాడు.

కథా నిలయం
1181
శ్రీకాకుళం

---